





# ఎన్నో కోర్సులు.. మరెన్నో కళాశాలలు

### ఇంజినీరింగ్ కోర్సులు

ఎం.పి.సి. గ్రూపుతో ఇంటర్ పాసైన విద్యార్థులు సరైన ఇంజినీరింగ్ కళాశాలను ఎన్నుకోవడంలో శ్రద్ధ వహించాలి. విద్యార్థుల సంఖ్య కంటే రాష్ట్రంలో ఇంజినీరింగ్ సీట్లు ఎక్కువగా ఉండటం వల్ల ఏదో ఓ కళాశాలలో, ఏదో ఓ బ్రాంచ్‌లో సీటు సులభంగానే దొరుకుతుంది. కానీ, భవిష్యత్తు బాగుండాలనుకునే విద్యార్థులు ఉత్తమమైన కళాశాలను ఎంచుకోవాలి. కళాశాలను ఎంచుకోవడంలో మంచి బోధన, మౌలిక సదుపాయాలు, ఉద్యోగ అవకాశాలను ప్రాతిపదికగా తీసుకోవాలి. ప్రముఖమైన సంస్థలు ప్లేస్‌మెంట్ కోసం క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించే ఇంజినీరింగ్ కళాశాలల్లో చేరడానికే విద్యార్థులు ఎక్కువగా ఆసక్తి చూపుతున్నారు. ఈ వెతుకులాటలో కాస్త ఎక్కువ ఖర్చు అయినా భరించే స్థోమత ఉన్నవారు ఇతర రాష్ట్రాల్లోని జాతీయ స్థాయి ఇంజినీరింగ్ కళాశాలల్లో చేరడానికి మొదటి ప్రాధాన్యం ఇస్తున్నారు.

### ర్యాంకింగ్ ఎలా?

**ఇంజినీరింగ్ కళాశాలల ర్యాంకింగ్:** మూడురకాలుగా జరుగుతుంది. **ఒకటి గవర్నమెంటు ర్యాంకింగ్:** భారత ప్రభుత్వం ప్రపంచబ్యాంకుతో కలిసి నిర్ణయించే ర్యాంకింగ్ పద్ధతి ఇది. యునైటెడ్ నేషన్స్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ పరిధిలోని ఈ ర్యాంకింగ్‌లో విద్యాసంస్థల నిధులకోసం ఇది ఉపయోగపడుతుంది.

**రెండోది అకడమిక్ ర్యాంకింగ్:** బోధనా పద్ధతులు, మౌలిక సదుపాయాలను ప్రాతిపదికగా చేసుకొని ప్రముఖ విద్యా సంస్థ, విద్యా సంబంధమైన వివిధ పత్రికలు ఇచ్చే ర్యాంకింగ్ ఇది. సంస్థలు తమ గురించి తాము ప్రచారం చేసుకునేందుకు ఈ ర్యాంకింగ్‌లో పాల్గొంటాయి.

**మూడోది పత్రికల ర్యాంకింగ్:** ప్రముఖ పత్రికలు మ్యాగజీన్లు నిర్వహించే ర్యాంకింగ్ కూడా ఒకటి ఉంది. సాధారణంగా ఇండియాటుడే, అవుట్‌లుక్, హిందూలాంటి పత్రికలు ఈ ర్యాంకింగ్‌లో పాల్గొంటాయి. ప్రజాభిప్రాయాలను తెలిపే ఈ ర్యాంకింగ్ విద్యార్థులు, తల్లిదండ్రులకు సంస్థ ఎంపికలో బాగా ఉపయోగపడుతుంది.

### ప్రవేశ పద్ధతులు

అఖిలభారత స్థాయిలోని ఇంజినీరింగ్ కళాశాలలన్నింటిలో కూడా సాధారణంగా ఏదో ఒక ప్రవేశపరీక్ష ద్వారానే విద్యార్థులను చేర్చుకుంటారు. ఎన్నో కళాశాలల్లో AIEEE ర్యాంకు ద్వారా ప్రవేశాన్ని కల్పిస్తున్నారు. మిగతా కొన్ని కళాశాలలు సంయుక్తంగా కానీ, విడివిడిగా కాని ప్రవేశ పరీక్షను నిర్వహిస్తున్నాయి. సాధారణంగా దక్షిణ భారత దేశంలో నిర్వహించే పరీక్షలను సెట్ (CET) అని, ఉత్తర భారతదేశంలో పరీక్షల్ని పి.ఇ.టి. (Pre Engineering Test) అని అంటారు అలాగే ఐ.ఐ.టి లు, బెనారస్ హిందూ యూనివర్సిటీ, ధన్‌బాద్ స్కూల్ ఆఫ్ మైన్స్ కలిసి సంయుక్తంగా నిర్వహించే పరీక్షను ఐ.ఐ.టి జె.ఈ.ఈ అంటారు. ఈ ఒక్కపరీక్ష మినహాయించి మిగతా ప్రవేశ పరీక్షలన్నీ ఇంచుమించు ఒకే సిలబస్‌తో ఒకేలా ఉంటాయి. బిర్లా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ మాత్రం ప్రవేశ పరీక్ష 'బిట్‌శాట్'ను ఆన్‌లైన్ పద్ధతిలో నిర్వహిస్తోంది. మనరాష్ట్రం నుంచి ఆయా పరీక్షలు రాయాలనుకునే అభ్యర్థులకు వారు చదివే ఎంసెట్ మెటీరియల్ చాలావరకు ఉపయోగపడుతుంది. ఇంటర్ సిలబస్ నుంచి దాదాపు 90శాతం ప్రశ్నలు వచ్చే అవకాశం ఉంటుంది. సి.బి.ఎస్.ఇ. సిలబస్‌పై అవగాహన ఉంటే సమాధానాలు రాయటం మరింత సులువవుతుంది. ఈ పరీక్షలకు సంబంధించిన నోటిఫికేషన్‌లు సాధారణంగా నవంబర్ - జనవరి మధ్యలో వెలువడతాయి. ప్రవేశ పరీక్షలు ఏప్రిల్- మే నెలల్లో ఉంటాయి.


డి. కృష్ణమూర్తి

### కొన్ని ప్రముఖ అఖిలభారత స్థాయి ఇంజినీరింగ్ కళాశాలలు

1) ఇండియన్ ఇన్‌స్టిట్యూట్స్ ఆఫ్ టెక్నాలజీ
2) బిర్లా ఇన్‌స్టిట్యూట్స్ ఆఫ్ టెక్నాలజీ (బిట్స్‌పిలానీ, గోవా)
3) నేషనల్ ఇన్‌స్టిట్యూట్స్ ఆఫ్ టెక్నాలజీ (ప్రధానంగా త్రిచీ, సూరత్‌కల్, వరంగల్, భోపాల్)
4) త్రిబుల్ ఐటీలు (ప్రముఖంగా హైదరాబాద్, అలహాబాద్)
5) బెనారస్ హిందూ యూనివర్సిటీ, ధన్‌బాద్ స్కూల్ ఆఫ్ మైన్స్
6) ధీరూభాయ్ అంబానీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ అండ్ కమ్యూనికేషన్ (గాంధీనగర్) AIEEE రాని విద్యార్థులు దీనికి ప్రత్యేకంగా దీనికి అప్లై చేసుకోవాల్సి ఉంటుంది.
7) వేలూర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ
8) ఢిల్లీ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్, నేతాజీ సుభాష్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఢిల్లీ. ఈ కళాశాలల్లో 85 శాతం సీట్లు ఢిల్లీ స్కూళ్లలో చదివిన విద్యార్థుల కోసమే ఉంటాయి. మిగతా 15 శాతం సీట్లను AIEEE ద్వారా దేశంలోని మిగతా ప్రాంతాల విద్యార్థులకు కేటాయిస్తారు. ప్లేస్‌మెంట్ విషయంలో ఈ కళాశాలలు ప్రసిద్ధి పొందాయి.
9) థాపర్ యూనివర్సిటీ, పాటియాలా: ఈ యూనివర్సిటీలో 50శాతం సీట్లను పంజాబ్ విద్యార్థులకు కేటాయిస్తారు.
10) బి.ఎం.ఐ.టి. (B.M.I.T) జైపూర్: దీనిలో 70 శాతం సీట్లను R.P.E.T ద్వారా 15 శాతం సీట్లను AIEEE ద్వారా మిగతా 15శాతం సీట్లను మేనేజ్‌మెంట్ కోటాద్వారా భర్తీ చేస్తారు.
11) కృష్ణ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ, ఘజియాబాద్ (మౌలిక సదుపాయాలకు ప్రసిద్ధి).
12) జాదవ్‌పూర్ యూనివర్సిటీ (కలకత్తా- పరిశ్రమలతో మంచి సంబంధాలను నెరపడంలో ఈ సంస్థ ప్రసిద్ధి.)
13. కొచ్చిన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ ( పాలిమర్ సైన్సెస్, రబ్బర్ టెక్నాలజీ, షిప్‌టెక్నాలజీ, ప్రసిద్ధి)
14) సత్యభామ యూనివర్సిటీ
15) విశ్వేశ్వరయ్య కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ (బెంగళూర్)
16) ఎం.ఎస్. రామయ్య ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (బెంగళూర్)
17) పి.డి.ఎం. కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ (ఔరంగాబాద్)

ఆర్థిక పరిస్థితి, తదితర కారణాల వల్ల ఇతర రాష్ట్రాలకు వెళ్లలేని విద్యార్థులు జాతీయస్థాయిలో గుర్తింపు ఉన్న ఆంధ్రప్రదేశ్‌లోని కింది కళాశాలలను ఎంచుకోవచ్చు.

1. O.U College of Engineering (Hyderabad)
2. J.N.T.U College of Engineering (Hyderabad, Anantapur)
3. College of Engineering A.U. (Vishakapatnam)
4. Vasavi College of Engineering (Hyderabad)
5. C.B.I.T (Hyderabad)
6. GITAM College of Engineering (Vishakhapatnam)
7. Muffakhanjah Engineering College (Hyd)
8. Sreenidhi Institute of Science and Technology (Ghatkesar, Hyd)

ఇంజినీరింగ్ విద్యలో అత్యంత ప్రధానమైంది ప్రాక్టికల్ లెర్నింగ్. తగినన్ని ప్రయోగాలు చేయకుండా కేవలం పుస్తకాలు, 'ఆల్ ఇన్ వన్స్' చదివి ఇంజినీరింగ్ డిగ్రీ తెచ్చుకున్న విద్యార్థి విధినిర్వహణలో ఇబ్బందులకు గురవుతాడు. ఇంజినీరింగ్ ఆఖరు సంవత్సరం చదువుతున్నప్పుడు విద్యార్థి కొన్ని పరిశ్రమలకు వెళ్లి అక్కడ పనిచేసి అనుభవం పొందాల్సి ఉంటుంది. అందుకే కళాశాలను ఎంపికచేసుకొనే సమయంలో ఆ కళాశాలకు పరిశ్రమలతో ఉన్న సంబంధాలను కూడా దృష్టిలో ఉంచుకోవాలి. అలాగే ఆ కళాశాల ప్రయోగశాలల నాణ్యతా ప్రమాణాల గురించి కూడా అవగాహన ఏర్పరచుకోవాలి.

విద్యార్థులు కళాశాల గురించి మాత్రమే కాకుండా ఏ బ్రాంచ్‌లో చేరాలో కూడా బాగా ఆలోచించాకే నిర్ణయం తీసుకోవాలి. కేవలం వ్యక్తిగత ఆసక్తినే కాకుండా భవిష్యత్తులో ఆ బ్రాంచ్‌కి ఉండే ఉద్యోగ అవకాశాలు, పరిశోధన సానుకూలతను కూడా దృష్టిలో ఉంచుకోవాలి. భవిష్యత్తులో ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్, కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్, ఇన్‌ఫర్మేషన్ టెక్నాలజీ, బయోటెక్నాలజీ రంగాలకు మంచి డిమాండ్ ఉంటుందని నిపుణుల అభిప్రాయం. మెకానికల్ ఇంజినీరింగ్‌ను ఎవర్‌గ్రీన్ బ్రాంచ్‌గా చెబుతారు.

### విదేశాల్లో...

ఇంటర్ పూర్తి చేసిన విద్యార్థులు మనదేశంలోనే కాకుండా అమెరికాలో కూడా ఇంజినీరింగ్ చదవొచ్చు. అమెరికాలోని ఎన్నో కళాశాలలు S.A.T. (Scholastic Aptitude Test) ద్వారా విద్యార్థులను ఇంజినీరింగ్ కోర్సుల్లో చేర్చుకుంటాయి. ఈ పరీక్ష ఇంగ్లిష్ గణిత శాస్త్రాల్లో ఆబ్జెక్టివ్ పద్ధతిలో (మన ఎంసెట్, ఎ.ఐ.ఈ.ఈ.ఈ లాగా) ఉంటుంది. ఎంసెట్‌కు ప్రిపేరైన విద్యార్థులు ఇంగ్లిష్‌లో శ్రమిస్తే సులువుగా రాయగలుగుతారు. అవసరమనుకుంటే కోచింగ్ తీసుకోవచ్చు.

SAT లో మంచి స్కోర్‌వచ్చిన విద్యార్థులకు M.I.T., ANNARBAR, Michigan University లాంటి మంచి విద్యాసంస్థల్లో సీటు లభించడమే కాకుండా విద్యా అవసరాలకు సరిపడే ఉపకార వేతనం కూడా వస్తుంది. కొన్ని విద్యాసంస్థలు S.A.T. తో పాటు TOEFL కూడా రాయాలనే నిబంధన పెడతాయి. అమెరికాలోని ఇంజినీరింగ్ కాలేజీల్లో ప్రాక్టికల్ ట్రయినింగ్‌కు అధిక ప్రాధాన్యం ఉంటుంది. సత్తా ఉన్న విద్యార్థి తక్కువ సమయంలో ఎక్కువ కోర్సులు చేయగలుగుతాడు.

(రచయిత కృష్ణమూర్తి ఐఐటి అకాడెమీ డైరెక్టర్)

(బైపీసీ వారికి కోర్సుల వివరాలు రేపటి సంచికలో)